క్లుప్తంగా

ఘనంగా ఇంజినీర్స్ డే



ఉయ్యూరు: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఏఈ జన్ను రాజేష్, ఇంజినీర్లు నరసారెడ్డి, నాగరాజు, సుబ్బారావులను ఘనంగా సత్కరించి, ఇంజినీర్ల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, జోనల్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు కుటుంబ రాజు, దీనవహి ప్రసాద్, ఊర కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. తాడిగడప కార్మికనగర్–2కు చెందిన కంచర్ల సాంబశివరావు, కంచర్ల శ్రీను రెండు రోజుల క్రితం జూపూడిలో వరదకు మునిగిన బంధువులను పరామర్శించటానికి వెళ్లారు. వారు తిరిగి తాడిగడపకు వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో కంచర్ల సాంబశివరావు, కంచర్ల శ్రీను మృతి చెందారు. కాగా దేవభక్తుని చక్రవర్తి బాధిత కుటుంబాలకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చక్రవర్తి తెలిపారు. పార్టీ నేతలు మాణిక్యపల్లి శ్రీనివాసరావు, కాకి శ్రీనివాసరావు, షేక్.ఖాదర్ బాషా, అద్దేపల్లి చందు, ఎండి.ఆలీజిన్నా, కొప్పుల వరప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: కాలేజీకి వెళ్లలేదని కుటుంబ సభ్యులు మందలించటంతో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమయిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్–2కు చెందిన యువతి మండలంలోని ఓ కాలేజీలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతోంది. కాగా ఈ నెల 13వ తేదీన కాలేజీకి అని ఇంటి నుంచి వెళ్లింది. అయితే ఆమె తరగతులకు రాలేదని కాలేజీ నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ వచ్చింది. సాయంత్రం ఆ విద్యార్థిని ఇంటికి రాగా కుటుంబ సభ్యులు కాలేజీకి ఎందుకు వెళ్లలేదని మందలించారు. దీంతో అదే రోజు రాత్రి ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ఆమె వెళ్లి పోయింది. ఈ ఘటనపై విద్యార్థిని తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన అహ్మదీయ ముస్లిం జమాత్ వార్షిక సమావేశం

కంకిపాడు: అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ కృష్ణాజిల్లా మహిళా విభాగం వార్షిక సమావేశం ఆదివారం ముగిసింది. మండలంలోని కుందేరు గ్రామంలో జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. అహ్మదీయ ముస్లిం జమాత్ మహిళా శాఖ జాతీయ కార్యాలయ ప్రతినిధి నైమా ఆరిఫ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. శాంతి స్థాపనలో మహిళల పాత్ర చాలా కీలకమన్నారు. మహిళలు చైతన్యవంతులు కావాలని సూచించారు. జిల్లా శాఖ అధ్యక్షురాలు మహమ్మద్ ఖదీజా బేగం మాట్లాడుతూ ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే మహిళల పరిస్థితి ఒకప్పుడు దీనంగా ఉండేదన్నారు. నేడు అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధిస్తూ సమాజ ఉద్ధరణలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు.

గండ్లు పూడ్చండి మహా ప్రభో!



నున్న(విజయవాడరూరల్): వరదల్లో విజయవాడ–నున్న ఆర్‌అండ్‌బీ రోడ్డులో వరదనీరు పారేందుకు పెట్టిన గండ్లు పూడ్చాలని నున్న, పరిసర గ్రామాల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. నున్న గ్రామంలో సుబ్బయ్యకుంట దగ్గర నుంచి పాయకాపురం వరకు వరద ఉద్ధృతిని తగ్గించి కండ్రిక, రాజీవ్‌నగర్, రాధానగర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్, పరిసర ప్రాంతాల ప్రజలకు వరద నుంచి కొంత మేరకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశాల మేరకు అధికారులు పలు చోట్ల రోడ్డుకు గండ్లు పెట్టారు. ప్రస్తుతం వరదలు తగ్గుముఖం పట్టడంతో వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు గండ్లు పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఆదివారం నుంచి విజయవాడ–విసన్నపేట, విజయవాడ–నూరంపల్లి, విజయవాడ–సత్తుపల్లి, విజయవాడ–నూజివీడు ఆర్టీసీ బస్సులు పాయకాపురం భవానీబార్ నుంచి రామవరప్పాడు వెళ్లే రోడ్డులో నున్న గ్రామం వచ్చి అక్కడ నుంచి పై ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధాన రహదారి విజయవాడ–నున్న రోడ్డులో వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు రోడ్డులో గండ్లు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వెళ్లిరా.. వినాయకా



ఉయ్యూరు వీరమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిమజ్జనానికి బయలుదేరుతున్న గణనాథుడు



తాడిగడపలో గణేషుడిని ఊరేగిస్తున్న చిన్నారులు



వినాయకుడి పూజలో పాల్గొన్న భక్తులు

ఉయ్యూరు: గణేష్ నవరాత్రులు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో తొమ్మిదో రోజైన ఆదివారం వినాయక నిమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై.. జై జై గణేశా అంటూ.. డప్పు వాయిద్యాల జోరు, డీజే సౌండ్స్ ఆటపాటలతో బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు. ఉయ్యూరు వీరమ్మతల్లి ఆలయ సమీపంలో లోక కల్యాణార్థం హోమం నిర్వహించి వినాయక నిమజ్జనం చేశారు. పట్టణంలోని కాలువ కట్టతో పాటు పలు ప్రాంతాల్లో నిమజ్జన ఊరేగింపులు జరగటంతో పట్టణంతో సందడి నెలకొంది. మండలంలోని బోళ్లపాడు, కాటూరు, ముదునూరు, పెద ఓగిరాల, చిన ఓగిరాల, ఆకునూరు తదితర గ్రామాల్లో గణనాథుడి నిమజ్జనాలు జరిగాయి.

సందడి.. సందడిగా

పెనమలూరు: మండల పరిధిలో ఆదివారం ఘననాథుడి ఊరేగింపులతో గ్రామాలలో సందడి వాతావరణం చోటుచేసుకుంది. పెనమలూరు మండలంలో వినాయకచవితి పండుగ సందర్భంగా దాదాపు 150 వినాయకుడి విగ్రహాలు ఆయా గ్రామాలలో పందిళ్లలో ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కాగా వినాయకుడి ఉత్సవాలు తుదిదశకు చేరుకోవటంతో ఆదివారం గ్రామాలలో వినాయకుడి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. కానూరు, మురళీనగర్, యనమలకుదురు, పోరంకి, పెనమలూరు, తాడిగడపతో పాటు పలు గ్రామాలలో దాదాపు 50 వినాయకుడి విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగించారు. వినాయకుడి ఊరేగింపు సందర్భంగా భక్తులు రంగులు చల్లుకుని, డీజేలతో డ్యాన్స్‌లు చేస్తూ హడావుడి చేశారు. తాడిగడప మిత్ర జ్యువెల్ అపార్టుమెంట్‌లో అన్నసమారాధన చేసి చిన్నారులు మట్టి వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు. పెనమలూరులో సీతారామాలయం వద్ద వినాయుడి లడ్డూను భక్తుడు బడుగు వెంకటేశ్వరరావు రూ. 50 వేలకు దక్కించుకున్నారు. వినాయకుడి విగ్రహాలను బందరు కాలువ, కేఈబీ కెనాల్‌లలో నిమజ్జనం చేశారు. వినాయకుడి ఊరేగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా గణేష్ ఉత్సవాలు..

ఉంగుటూరు: మండలంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తేలప్రోలు పార్సన్ పేట మాను దగ్గర వేంచేసి ఉన్న కోదండరామ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద రామాలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ ఆదివారం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నసంతర్పణలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం నుంచి గణేష్ నిమజ్జన శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పెద్ద అవుటపల్లి, తేలప్రోలు, నందమూరు, తరిగొప్పల, వేంపాడు, వెన్నూతల, ఇందుపల్లి గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు.

ముగిసిన పూజలు..

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గణేష్ నవ రాత్రి పూజా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. గడిచిన తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిదో రోజు వికాస్ విద్యాసంస్థల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు.

వైభవంగా గణపతి నిమజ్జన వేడుకలు



దావాజిగూడెంలో గణపతి నిమజ్జన గ్రామోత్సవం

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న గణపతి నవరాత్రులు ఆదివారం ఘనంగా ముగిశాయి. తొలుత ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో స్వామివారికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలోని పూర్ణం ప్రసాదానికి నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన చిగులూరి శ్రీనివాసరావు రూ. 1,00,116 దక్కించుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని గొంది శివరామకృష్ణ రూ. 1,05,116 పాడుకున్నారు. అనంతరం వెయ్యి మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఏలూరు కాలువలో స్వామివారిని నిమజ్జనం చేశారు. స్థానిక రాయ్‌నగర్‌లోని సీఎంఎల్. రాయుడు వాటర్ ట్యాంక్ వద్ద జరుగుతున్న గణపతి మహోత్సవాలు ముగిశాయి. స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం జరిపారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



మంత్రి పార్థసారథికి చెక్కు అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి



తాడిగడపలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నేతలు



కానూరులో వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, విద్యార్థులు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆదివారం ప్రత్యేక వాహనంలో దుస్తులను పంపారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ అందిస్తున్న సేవలను అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్ట్ కొల్లా సరేంద్ర వివరాలు తెలుపుతూ ఎన్ఎస్ఎస్ విభాగం, లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్, రేడియో మిర్చి సహకారంతో వాంబే కాలనీ, ఉడా కాలనీ, పరిసర ప్రాంతాల్లో బాధితులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. తమ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ వరదల సమయంలో వరద ప్రాంతాలకు వెళ్లి సాయం అందించారని తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ..

పెనమలూరు: వరద బాధితులకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తాడిగడప సీఐటీయూ కార్యాలయంలో మండల సీటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పని చేసిన కార్మికులను సీఐటీయూ ఆదుకుంటుందని త్రిమూర్తి అన్నారు. నిత్యావసర సరుకులతో పాటు, దుస్తులు, వంట సామగ్రి కూడా అందజేశామన్నారు. కరోనా సమయంలో కూడా సీఐటీయూ సేవలు అందించిందని వివరించారు. సీఐటీయూ నేతలు వై.సరళ, బుజ్జులు, పి.సత్యనారాయణ, విజయ, ఉప్పాడ ఈశ్వరి పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

నున్న(విజయవాడరూరల్): వరద బాధితుల సహాయార్థం సాదం శ్రీనాథ్ 3లక్షల 51వేల రూపాయలు, భీమవరపు సంపత్‌కుమార్ రెడ్డి 3లక్షల51వేల రూపాయలు, సింగంరెడ్డి ప్రదీప్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కులను ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం రాష్ట్ర గృహనిర్మాణశాఖ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథికి అందజేశారు. నున్న గ్రామంలో సాయిబాలాజీ ఎన్‌క్లేవ్ నివాసులు ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి పార్థసారథి పాల్గొని పూజలు చేశారు. అనంతరం వినాయక చవితి లడ్డూప్రసాదం వేలం పాట నిర్వహించగా.. సింగంరెడ్డి ప్రదీప్‌రెడ్డి 20 కేజీల లడ్డూను 26లక్షల రూపాయలకు దక్కించుకున్నారు.

స్టీలు సామాన్లు, హోమియో మందుల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగయ్య అప్పారావు పేటలో వరద బాధితులకు కమ్మవారి ఐక్య సేవా సమితి అండగా నిలిచింది. ఇళ్లు ముంపునకు గురి కావటంతో నష్టపోయిన వారికి స్టీలు సామాన్లు, హోమియో మందులను ఆదివారం పంపిణీ చేసింది. దాదాపు 200 కుటుంబాలకు వంట సామగ్రితో పాటుగా జర్వం, ఎలర్జీ, నొప్పులు నియంత్రణకు హోమియో మందులు పంపిణీ చేశారు. కమ్మవారి ఐక్య సేవా సమితి అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ, గౌరవ సలహాదారుడు అట్లూరి రాజశేఖర్, సహాయ కార్యదర్శి పాట్లూరి ఫణేంద్రకుమార్, సభ్యులు కొల్లిపర శ్రీనివాస్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్

కంకిపాడు: విలువలతో కూడిన విద్యనభ్యసించాలని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన మండల పరిషత్ పాఠశాల భవనాన్ని తుమ్మల చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉన్నత విలువలు ఎంతో అవసరమన్నారు. సమాజహితమే లక్ష్యంగా విద్యార్థులు ప్రగతి పథాన సాగాలన్నారు. ఎంఈఓలు బీవీ శేషగిరిరావు, కె.వరప్రసాద్ మాట్లాడుతూ పూర్వ సీబీసీఎన్‌సీ పాఠశాల మూతబడటంతో తల్లిదండ్రుల కోరిక మేరకు దాతల సౌజన్యంతో పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించి పాఠశాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చోరగుడి సురేష్‌కుమార్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, నేతలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



గన్నవరం: కమ్యూనిస్టు ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఘనత సీతారాం ఏచూరికి దక్కుతుందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గన్నె మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై ఏచూరి రాజీలేని పోరాటం చేశారని చెప్పారు. గత మూడు దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా ఎన్నో పోరాటాలకు ఆయన ఊపిరి పోశారని గుర్తు చేశారు. అటువంటి పోరాటయోధుడిని కోల్పోవడం సీపీఎంకు, దేశానికి తీరని లోటని చెప్పారు. పార్టీ నేతలు కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, సామాజికవేత్త డాక్టర్ ఎం. విజయకుమార్, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే పంట పొలాలు



ఆరుగొలనులో వరద నీటి ముంపులో పంట పొలాలు



రంగయ్య అప్పారావు పేటలో కుళ్లిపోయిన వరి పంట

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పాటుగా బుడమేరు వరదనీటితో ముంపునకు గురైన పంట పొలాలు నేటికీ తేరుకోలేదు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, రంగయ్య అప్పారావు పేట, ఓగిరాల, రామన్నగూడెం గ్రామాల్లో వరి పంట పొలాలు రెండు వారాలు దాటుతున్నప్పటికీ ఆదివారం నాటికి కూడా పూర్తిగా నీట మునిగి జలాశయాలను తలపిస్తున్నాయి. బుడమేరు ఉద్ధృతంగా ప్రవహించటంతో ఆయా గ్రామాల పరిధిలోని దాదాపు 9 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగి అన్నదాతకు భారీగా నష్టం వాటిల్లింది. దాదాపు పదిరోజుల పాటు నీట మునిగిన వరి పొలాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఆరుగొలను, ఓగిరాలలో ఇంకా పలుచోట్ల వరి పొలాలు వరద ముంపు నుంచి ఇంకా బయట పడలేదు. వరద నీటిలో రోజుల తరబడి మునిగిన వరి పంట పలుచోట్ల పూర్తిగా కుళ్లిపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. వరి పొలాల్లో ఎకరాలకు సగటున రూ.15 వేలు వరకు ఇప్పటికే పెట్టుబడి వ్యయం అయిందని రైతులు వాపోతున్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో అసోసియేషన్ సభ్యులు

పెనమలూరు: రిటైర్డ్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరంకిలో ప్రతిభ చాటిన నిరుపేద విద్యార్థులు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా స్థానిక ఎల్ఎస్ గార్డెన్స్‌లో ఇంజినీర్స్ డే ఆదివారం ఘనంగా చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ జెన్‌కో డైరెక్టర్, చీఫ్ ఇంజినీర్ ఎం.సుజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలు మరువలేనివన్నారు. నేటి విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బీటెక్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, పదో తరగతి చవుతున్న ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు రూ. 70 వేల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మండల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జి.పట్టాభిరామారావు, కార్యదర్శి అన్నే సాంబశివరావు, కోశాధికారి ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంతులీనేదెప్పుడో ?

ప్రారంభానికి నోచుకోని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ

- హనుమాన్‌జంక్షన్‌లో రూ.9.6 కోట్లతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు
- ఎన్నికలకు ముందే దాదాపు పనులు పూర్తి
- మూడు నెలలుగా పట్టించుకోని కూటమి సర్కారు



హనుమాన్‌జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ స్తంభాలు



జంక్షన్ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్క్ లైటింగ్ పోల్

హనుమాన్‌జంక్షన్ రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పలు అభివృద్ధి పనులు హనుమాన్‌జంక్షన్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జంక్షన్ ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు దాదాపు రూ.9.6 కోట్ల వ్యయంతో పనులు మంజూరు చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందుగానే దాదాపు పనులు పూర్తి అయినప్పటికీ అరకొర పనులు మిగిలి ఉన్నాయి. నేటికీ ఆ పనులు ప్రారంభానికి నోచుకోకపోవటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రారంభమెప్పుడు?

హనుమాన్‌జంక్షన్‌లోని ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించారు. మార్చి నెల నాటికే శరవేగంగా దాదాపుగా 90 శాతం పనులు పూర్తి చేశారు. విజయవాడ రోడ్డు, ఏలూరు రోడ్డు, గుడివాడ రోడ్డు, నూజివీడు రోడ్డులో కలిపి మొత్తం ఆరు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్ల దూరంతో మొత్తం 150 స్తంభాలు ఏర్పాటు చేశారు. జంక్షన్ మెయిన్ సెంటర్, వేలేరు క్రాస్ రోడ్డు, బైపాస్‌రోడ్డుల వద్ద నాలుగు హై మ్యాక్స్ సెంట్రల్ లైటింగ్ పోల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. కేవలం విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటమే ఇంకా మిగిలిన ఉండగా, ఇంతలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఎక్కడి పనులు ఎక్కడే నిలిచిపోయాయి. మూడు నెలలుగా సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ప్రధాన రహదారుల్లో అలంకారప్రాయంగా మారాయి.